


# నవభూమి

జిల్లా అనుబంధం

06 నవంబర్,2024 బుధవారం పేజీలు:7

www.epaper.navabhoomi.in




## పత్తి కొనుగోళ్లలో
# దళారుల దగా

- సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో మార్కెటుకు తాళాలు
- కాంటాలను అడ్డుకున్న రైతులు

**ఖమ్మం, నవభూమి బ్యూరో, నవంబర్ 5:** పత్తి కొనుగోళ్లపై రైతులు కన్నెర్ర చేశారు. కనీస మద్దతు ధర క్వింటా రూ.7,521 ఉండగా ఐదువేలకు మించి కొనుగోలు చేయకపోవడంతో కడుపు మండిన రైతులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం పత్తి మార్కెట్లో ధర్నా నిర్వహించారు. తొలుత పత్తి మార్కెట్లోకి వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. గేటు ముందు భారీ ధర్నా నిర్వహించారు. తర్వాత మార్కెట్లోకి పెద్ద సంఖ్యలో వెళ్లిన కార్యకర్తలు, నాయకులు పత్తి కాంటాలను అడ్డుకున్నారు. సిపిఐ రైతు సంఘం నాయకులు ఏ రైతును పలకరించినా కన్నీటి పర్యంతం అవుతూ తమ వ్యధను వివరించారు. ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదని, అనేక వ్యయ ప్రయసాలకొచ్చి పత్తిని మార్కెట్కు తీసుకు వస్తే అడ్డంగా అడుగుతున్నారని వాపోయారు. క్వింటా ఐదు వేలకు మించి కొనుగోలు చేయడం లేదని తెలిపారు. మార్కెట్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభించిన నాటి నుంచి ఇంత వరకు ఒక్క రోజు కూడా మద్దతు ధర రూ.7,521 క్వింటా పత్తి కూడా కొనుగోలు చేయలేదని రైతులు తెలిపారు. రైతులు, సిపిఐ కార్యకర్తలు కాంటాలను నిలిపివేసి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయానికి తాళం వేసి కార్యాలయం ఎదుట బైఠాయించారు. వ్యవసాయ మార్కెట్లో కార్యకలాపాలు స్తంభించాయి.

**పత్తి కొనుగోళ్లలో దళారుల దందా :బాగం**

పత్తి కొనుగోళ్లలో దళారుల దందా రైతులను తీవ్ర నష్టాలకు, కష్టాలకు గురి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. పత్తి మార్కెట్లో ఆందోళన చేస్తున్న రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ దళారుల చేతిలో వ్యవసాయ మార్కెట్ బంధీ అయిందని సిసిఐ కీలు బొమ్మగా మారిందన్నారు. ఖమ్మం మార్కెట్లో ఇప్పటి వరకు ప్రైవేటు వ్యాపారులు 5,200 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే సిసిఐ కొనుగోలు చేసింది కేవలం 178 మెట్రిక్ టన్నులు మాత్రమేనని హేమంతరావు తెలిపారు. పత్తి ఎక్కువగా పండించే ప్రాంతాలలో సిసిఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం వెనక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. జిల్లాలో 199700 ఎకరాలలో ఈ ఏడాది పత్తి పంటను సాగు చేశారని అతివృష్టి, అననుకూల వాతావరణ పరిస్థితులలో దిగుబడులు కనిష్ట స్థాయికి పడిపోయి పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతుల పరిస్థితి అమ్మబోతే అడివి కొనబోతే కొరివి అన్న చందంగా తయారైందని, పత్తిని మార్కెటు తెస్తే క్వింటా నాలుగైదు వేల నుంచి కొనుగోలు చేయడం లేదని హేమంతరావు తెలిపారు. ఖమ్మం



వ్యవసాయ మార్కెట్లో ఒక క్వింటా కూడా ఏడువేల రూపాయలకు మించి కొనుగోలు చేయలేదంటే రైతాంగం పట్ల ప్రభుత్వ వైఖరి అవగతమవుతుందన్నారు. సిసిఐలో దళారుల హవా కొనసాగుతుందని రైతుల వద్ద పత్తి కొనేందుకు కొర్రీలు పెడుతున్న సిసిఐ దళారుల వద్ద నుంచి కొనేందుకు ఎటువంటి పేచీలు పెట్టడం లేదన్నారు. పత్తి పండించే ప్రాంతాలలో సిసిఐ కేంద్రాలను తక్షణం ఏర్పాటు చేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. లక్ష మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని ఆశిస్తున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఖమ్మం మార్కెట్ లో సిసిఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లేని పక్షంలో పత్తి కొనుగోళ్లను అడ్డుకుంటామని హేమంతరావు హెచ్చరించారు.

**జెసి హామీతో ఆందోళన విరమణ:**

పత్తికి గిట్టుబాటు ధర లభించేవిధంగా చర్యలు తీసుకుంటామని జెసి హామీ ఇవ్వడంతో సిపిఐ, రైతు సంఘం నాయకులు ఆందోళన విరమించారు. సిసిఐ కొనుగోలు కేంద్రాలు పెంచుతామని హామీ ఇచ్చారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి రైతుల సమస్యలను వివరించారు. సిఐ దామాల రమేష్ నేతృత్వంలో పోలీస్ బందోబస్తు నిర్వహించగా ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర నాయకులు మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్రెడ్డి, యర్రాబాబు, రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, నాయకులు అడపా రామకోటయ్య, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి, అజ్మీర రామ్మూర్తి, రవీంద్రబాబు, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, పుచ్చకాయల సుధాకర్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వీరభద్రం, కూచిపూడి రవి, ఎసు, మల్లికార్జున్, శంకర్రావు, ఏనుగు గాంధీ, రామకృష్ణ, సాంబశివరెడ్డి, శశిధర్, శ్రావణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీలను వర్గీకరణ చేయాలి

- ఆదివాసి హక్కుల పోరాట సమితి
- తుడుందెబ్బ మహాసభలు
- పాల్గొన్న జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

**టేకులపల్లి నవంబర్ 5 నవభూమి ప్రతినిధి:** రేకులపల్లిలోని సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణంలో, ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ టేకులపల్లి మండల మహాసభలు మంగళవారం నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంపిడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి వట్టం కన్నయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పూనెం బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి దుగ్గరాపు వీరభద్రం, ఇల్లందు మండల అధ్యక్షులు సువర్ణపాక రామారావు హాజరయ్యారు. రమణాల లక్ష్మయ్య మాట్లాడుతూ, ఆగస్టు ఒకటి 2024న, దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు, ఎస్టీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే, ఎస్టి వర్గీకరణను జరపాలని ఆయన అన్నారు. ఈ ఎస్టీ వర్గీకరణ, జనాభా ధమాషా ప్రకారం కాకుండా, రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిషన్ను నియమించి, ఎస్టీ తెగలలో మొత్తం ఎన్ని తెగలు



ఆర్థికంగా అభివృద్ధి చెందిన , అభివృద్ధి చెందని తెగలు ఎన్ని, కమిషన్ రిపోర్ట్ తీసుకొని దాని ఆధారంగా ఎస్టీ వర్గీకరణ జరగాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా టేకులపల్లి మండలంలో నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులుగా తాటి రవికుమార్, ప్రధాన కార్యదర్శి పాయం శ్రీను, మండల ఉపాధ్యక్షులుగా గొగ్గల అశోక్, జోగ భరత్, బిజ్జా కిరణ్, సహాయ కార్యదర్శిగా మోకాళ్ళ సునీల్, కోశాధికారిగా జోగ వంశీ, ప్రచార కార్యదర్శులుగా నాగేంద్ర, బీజ్జా శ్రీకాంత్, సలహాదారుగా మూతి వెంకన్న, మండల కార్యవర్గం మొత్తం 21 మందితో ఎన్నుకోవడం జరిగింది.

# నేటి నుంచి సమగ్ర సర్వే

**ఖమ్మం-నవభూమిబ్యూరో:** కుటుంబాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సర్వేను ఇంటింటా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి సర్వే చేపట్టనుంది.

15 రోజుల పాటు సందడిగా ఈ ప్రక్రియ సాగనుంది. సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక ప్రత్యేకాధికారిని సర్కారు నియమించింది. తుది నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమర్పించనున్నారు.

75 అంశాలపై వివరాల సేకరణ

వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఇతర బలహీన వర్గాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపరచటమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సర్వే చేపడుతోంది. జిల్లాలోని 6,33,304 కుటుంబాలకు సంబంధించి 75 అంశాలపై వివరాలను అధికారులు సేకరించనున్నారు. కుటుంబ యజమానితోపాటు సభ్యుల వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, కులవృత్తులు, భూములు, గత ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన పథకాల వివరాలతోపాటు ఆయా కుటుంబాల రాజకీయ నేపథ్యం తదితరాలను పొందుపరుస్తారు. అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకే కాకుండా ప్రభుత్వ పథకాల అమలుకు ఈ సర్వే ఉపకరిస్తుందని సర్కారు భావిస్తోంది.

**3,654 ఎన్యుమరేషన్ బ్లాకులుగా విభజన**

ఖమ్మం జిల్లాను 3,654 ఎన్యుమరేషన్ బ్లాకు(ఈబీ)లుగా విభజించి సర్వే నిర్వహించనున్నారు. 3,719 మంది ఎన్యుమరేటర్లు విధులు నిర్వర్తించనున్నారు. ఎస్జీటీలు, ఏఈఓలు, అంగన్వాడీ ఉపాధ్యాయినులు, ఏపీడబ్ల్యూలు, ఆశా కార్యకర్తలు, సీఆర్పీలు, జూనియర్ అసిస్టెంట్లు, వార్డ్ అధికారులు, ఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు ఇలా వివిధ శాఖలకు చెందిన సిబ్బంది ఎన్యుమరేటర్లుగా వ్యవహరిస్తారు. పది మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్వైజర్ చొప్పున మొత్తమ్మీద 314 మందిని నియమించారు. 150 ఇళ్లను ఒక ఎన్యుమరేషన్ బ్లాకుగా పరిగణిస్తున్నారు. ఒక్కో ఎన్యుమరేటర్ రోజుకు పది ఇళ్ల చొప్పున 15 రోజుల్లో 150 గృహాలకు సంబంధించిన సర్వే చేయాల్సి ఉంటుంది. ప్రతి ఎన్యుమరేటర్కు ప్రత్యేక బ్యాగు అందజేశారు. ఇందులో స్టేషనరీ సహా సర్వే కాపీలు ఉంటాయి. సర్వే వివరాలను ఏరోజుకారోజు మండలాల వారీగా ప్రత్యేకంగా నియమించిన ఆపరేటర్లతో ఆన్లైన్ చేస్తారు. సర్వే నిర్వహిం ృచే ప్రాంతాల్లో ఒకరోజు ముందుగానే చాటింపు వేస్తారు. ప్రజలు అందుబాటులో ఉంటూ అన్ని ధ్రువ పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచిస్తున్నారు.

## మండల వ్యాప్తంగా ఘనంగా నాగుల చవితి పూజలు

### జమలాపురం సదాశివుని సన్నిధిలోని పుట్ట వద్ద బారులు తీరిన మహిళలు





**ఎర్రుపాలెం, నవభూమి, నవంబర్ 5 :** నాగేంద్ర హారాయ త్రిలోచనాయ- భస్మాంగ రాగాయా మహేశ్వరాయ- నిత్యాయ శుద్ధాయ దిగంబరాయ- తస్మైనా కారాయ నమః శివాయ,అంటూ అర్చకులు నాగుల చవితి సందర్భంగా నాగేంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో మహిళలు ఉదయం నాలుగు గంటల నుండి నాగేంద్ర స్వామి పుట్టల వద్ద పాలు పోసేందుకు కార్తీక స్నానాలు చేసి కుటుంబాలతో వెళ్లారు. పుట్టలలో పాలు పోసిన మహిళలు తమ కుటుంబాలను,రేయనక పగలనక పొలాలలో పనిచేసే రైతులను కాపాడాలని నాగేంద్ర స్వామిని వేడుకొన్నారు. జమలాపురం సదాశివుని గుట్టపై వేం చేసియున్న పుట్ట వద్ద మహిళలు ఉదయం నుండే పెద్ద ఎత్తున బారులు తీరారు. శివాలయం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.అదేవిధంగా ఎర్రుపాలెం, బనిగండ్లపాడు, మీనవోలు, రేమిడిచర్ల, సకనవీడు,మలుగుమాడు,భీమవరం తదితర గ్రామా లలో నాగులచవితి సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తునపుట్టలలో నాగేంద్ర స్వామికి పాలు పోసి పూజలు నిర్వహించారు.

## విజయవంతంగా ముగిసిన తెలంగాణ జన సమితి సభ్యత్వ కార్యక్రమం

**గుండాల నవంబర్ 5 నవభూమి:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదివేల క్రియాశీల సభ్యత్వాలు 40 వేల ప్రాథమిక సభ్యత్వాలు చేయవలసిందిగా మా పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం టార్గెట్ పెట్టినారు. ఈ జిల్లాలో ఒకటి రెండు మండలాలు మినహాయించి ప్రతి నియోజకవర్గంలో 500 క్రియాశీల సభ్యత్వాలు, 1500 ప్రాథమిక సభ్యత్వాలు అయినట్టు టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్ రావు తెలియజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పార్టీ సభ్యులు చాలా బాధ్యతతో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శ్రద్ధగా పనిచేస్తున్నారు. అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నాను, ప్రొఫెసర్ కోదండరాం చర్ల, వాజేడు మండలాలకకు అతి త్వరలో రాబోతున్నారు. పెద్దఎత్తున పార్టీలో జాయినింగ్ కార్యక్రమం ఉన్నందున ఉద్యమకారులు యువకులు విద్యార్థి నాయకులు మేధావులు గమనించి కోదండరాం నాయకత్వాన్ని బలపరచవలసిందిగా కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో గుండాల మండల అధ్యక్షులు గొల్లపల్లి రమేష్, కుంజా రామ్మూర్తి, వట్టం కృష్ణయ్య, ముత్తయ్య, రాములు, భద్రం, పాపారావు తదితరులు పాల్గొన్నారు



## సింధు నాగరికత కాలిభంగన్‌లో ఏడో గొట్టు మూలాలు

- సింధు నాగరికత నిర్మించింది కోయ రాజులు
- పరిశోధన సెంటర్ డైరెక్టర్ కాక నర్సింగరావు, డాక్టర్ అరుణ్ కుమార్ వెల్లడి





**గుండాల నవంబర్ 5 నవభూమి:** రాజస్థాన్ రాష్ట్రంలోని సింధు నాగరికతలో ముఖ్యమైన పట్టణమైన కాలి బంగన్ లో పరిశోధన కొనసాగుతుంది. ముందుగా అక్కడ 1960 నుండి జరిపిన త్రవ్వకాలలో బయటపడిన కుండా పెంకులు, మట్టి బొమ్మలు, ఆ ప్రజలు వాడిన పరికరాలు, అబరణలు, కుండలపై అధ్యయనం చేయటం జరిగింది, ఆ మ్యూజియంలో ఉన్న వస్తువుల ఆధారంగానే ఇది కోయ నాగరికత అని నిర్ధారణ అయినట్టు బృందం పేర్కొంది. నాటు వైద్యం దంచే రోలు, కుండల పై 3 నుండి 7 గోట్ల కి సంబంధించిన గీతలు, జింక నీ పోలిన మట్టి బొమ్మలు, మట్టి గాజులు ఇవన్నీ కోయ గోండు సమాజంలో ఆనవాళ్లు అని అన్నారు. కాలి భంగన్ లో భారత పురావస్తు శాఖ త్రవ్విన కె - 30 (ఏ) లో 7వ గొట్టు రాజ్యం కాలి బంగన్ అనేది స్పష్టంగా ఉంది. ఇది పారేడు గట్టు వంశం ఇంటి పేర్లను తెలియచేస్తుంది. కోయ బాష లో దీని అర్థం పెద్ద మర్రి మడవి, మడి మర్రి పాయం, నడిపి మర్రి సోయం, గౌతాంపల్లి పూసమ్, తోక పట్టిన తోలెం, గొలుసు పెయితో ఏనుక, ఏళ్ల బోదు స్తుందు ఏళ్ళబోయిన, గులండ్ పెట్టే వాల్ తొందు గుండి, గొద్దలితి కోద్దుండు కొంద్రు, బాడిస తేవాటు తిందు బాడిస, నల్ల బాదం కుంజ లు, తోక చినత ముమందు కంగాల, ఈ 12 మంది కొడుకులు మడావి వంశంలో పుట్టినట్టు తెలుపుతుంది. ఇదంతా 7వ గొట్టు రాజ్యం అనేది మా పరిశోధన కేంద్రం సేకరణ చేసిన తాల పత్రం లో ఉన్నట్టు పేర్కొన్నారు. సింధు లిపి కోయ లిపి అని దానిని డి కోడ్ చేసి ఈ దేశ చరిత్ర ఆదివాసీల చరిత్ర అని నిర్ధారణ చేయటం కోసమే మ పరిశోధన కేంద్రం స్థాపించి అంత్రపాలాజీ, ఆర్కియాలజీ, బాషా శాస్త్రం, ట్రైబల్ స్టడీస్, విద్యార్థులను ఈ సెంటర్ నుండి చదివిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దేశ మూలం కోయ బాషా అని ఈ దేశం లో ప్రతి పేరు కోయ బాషా లోనే ఉంది అన్నారు. పరిశోధనలో ఆర్కియాలజీ విద్యార్థులు పాయం.పూర్ణ చందర్, ఇర్ప.ప్రభాకర్, చర్ప.రాజు, కుంజ కృష్ణ ప్రసాద్ కాక నవ్య కొమరం ధనలక్ష్మి లు పాల్గొన్నారు

## లింగన్న ఆశయాల సాధన కోసం పోరాడుదాం

- సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ






**గుండాల నవంబర్ 5 నవభూమి:** దోపిడి పీడనలేని సమ సమాజం కోసం పోరాడుతూ ది 31 జులై 2019న రోళ్లగడ్డ పంది గుట్ట వద్ద ఎన్కౌంటర్ పేరుతో హత్య గావించచంపబడ్డ అమరుడు కామ్రేడ్ లింగన్న ఆశయాల సాధన కోసం పోరాడాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి అరెం నరేష్, డివిజన్ నాయకులు యాసారపు వెంకన్న, ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి పర్శక రవి పిలుపునిచ్చారు. మంగళవారం రోళ్లగడ్డ గ్రామంలో లింగన్న స్తూపం వద్ద జరిగిన సంస్మరణసభలో వీరు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం అజ్ఞాతంలోకి వెళ్లి అనేక పోరాటాలు నిర్వహించారని, ముఖ్యంగా ఈ ప్రాంతంలో సింగరేణి ఓపెన్ కాస్ట్ కు వ్యతిరేకంగా, పోడు భూముల పట్టాల కొరకు పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్వహించారని అన్నారు. ఈ ప్రాంత ప్రజల తలలో నాలుకలగా గిరిజన, గిరిజనేతర పేద ప్రజల సమస్యల కోసం అనునిత్యం అవిశ్రాంతి లేకుండా పోరాడాలని కొనియాడారు. నేటి యువత అయిన మార్గంలో ప్రయాణించడమే ఆయన ఆరిపించే నిజమైన నివ్వాలని అన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని, అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అరకొరగా చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు, రైతు భరోసా ఎకరాకు రూ. 7500 ఇస్తామని ఆరు నెలలు గడుస్తున్న ఇప్పటికి రైతు ఖాతాలోవేయలేదని వెంటనే రైతు ఖాతాలో రైతు భరోసా నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ మండల నాయకులు పెండెకట్ల పెంటన్న, ఈసం మంగన్న, ఇసం కృష్ణన్న, పునే%శీ% పొట్టయ్య, పాయం ఎల్లన్న, కల్తి నరసింహారావు, గొగ్గల శ్రీను, భానోతులాలు, ఇసం కోటన్న,తాటి రమేష్, మోకాళ్ళ ప్రసాద్, ఈసం సుధాకర్, వాగబోయిన బుచ్చయ్య, అరేం జోగయ్య, చింత కోటేష్, పునె నరసయ్య పాల్గొన్నారు.

## మహిళ కార్మికురాలికి నష్టపరిహారం

## రు.60 వేల రూపాయల అందజేత

- బిఆర్‌టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్

**కుత్బుల్లాపూర్ నవంబర్ 5: (నవభూమి ప్రతినిధి)**బాలనగర్ ఇండస్ట్రీ ఏరియా మాధవి నగర్ లోని"పావి ప్రెస్ టూల్స్ వర్క్ షాప్ లో కార్మికురాలు రూప గత కొన్ని సంవత్సరాలుగా పని చేయడం జరుగుతుంది... పని చేస్తుండగా కార్మికురాలు రూప కు మధ్యలో రెండు వేలు పూర్తిగా కట్ కావడంతో వర్క్ షాప్ యజమాన్యం హాస్పిటల్ కి తీసుకెళ్లి వైద్యం చేయించారు. కార్మికురాలు కి నష్ట పరిహారం అవి ఏవి ఇవ్వకుండా వర్క్ షాప్ యజమాన్యం నిర్లక్ష్యం చేస్తూ పంపించేవారు, ఎవరికి చెప్పినా ఎవరు ఏమి చేయరు అని కార్మికురాలని నిర్లక్ష్యం చేస్తూ మాట్లాడేవారు. రూప అనే కార్మికురాలికి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారో అని తోటి కార్మికుల ద్వారా తెలుసుకొని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్గురించి తెలుసుకొని రవిసింగ్ కార్యాలయం వద్దకు వెళ్లి కార్మికురాలు రూప కు జరిగిన అన్యాయం చెప్పుకున్నారు, ఆ తర్వాత వెంటనే స్పందించిన, రవిసింగ్ హుటాహుటిన, పవి ప్రెస్ టూల్స్ వర్క్ షాప్" దగ్గరికి వెళ్లి యజమాన్యంతో మాట్లాడి కార్మికురాలికి రావలసిన నష్ట పరిహారం గురించి పలుమార్లు చర్చించి, కార్మికురాలు రూపకు నష్ట పరిహారం, 60,000/- రూపాయలు ఇప్పించడం జరిగింది.

# ఘనంగా నాగుల చవితి పండుగ వేడుకలు

### పుట్టల వద్ద కిటకిటలాడిన భక్తులు



**కల్లూరు, నవభూమి, నవంబర్ 5:** కల్లూరులో నాగుల చవితి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. అమావాస్య తరువాత వచ్చే, కార్తీక శుద్ధ చతుర్థిని నాగుల చవితి పండుగ అంటారు. ఈ పండుగను పురస్కరించుకొని, కుటుంబసభ్యులు పాముల పుట్టల వద్దకు చేరుకొని దీప, ధూప, నైవేద్యాలతో పుట్టలో పాలు పోసి, సాంప్రదాయ భద్రంగా పూజలు నిర్వహించడంతో పుట్టల వద్ద భక్తులతో నిండిపోయి కిటకిటలాడాయి. నాగుల చవితి నాడు నాగేంద్రుని శివభావంతో అర్పిస్తే, సర్వరోగాలు పోయి, సౌభాగ్యవంతులవుతారని భారతీయుల నమ్మకం. అనంతరం భక్తులు సమీప శివాలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయ బద్ధంగా భక్తులు నాగుల చవితి వేడుకలను ఘనంగా జరుపుకోవడంతో మండలంలోని అన్ని గ్రామాలలోని ఆలయాలలో పండుగ సందడితో కోలాహలంగా మారింది.

# టిపిటిఎఫ్ నూతన మండల కమిటీ ఎన్నిక




**గుండాల నవంబర్ 5 నవభూమి:** టి పి టి ఎఫ్ మండల శాఖ నూతన అధ్యక్ష ప్రధాన ప్రధాన కార్యదర్శులుగా బానోత్ భోజ్య, ఈసం ముత్తయ్య లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమములో ఉపాధ్యాయ దర్శి సంపాద కులు యం. రామాచారి, జోగ రాంబాబు, టి పి టి ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బాలు, టి పి టి ఎఫ్ జిల్లా కార్యదర్శి గుమ్మడి సమయ్య, రాష్ట్ర కౌన్సిలర్, చాట్ల శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి: ఆర్డీవో



**ఎర్రుపాలెం, నవభూమి, నవంబర్ 5 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేస్తున్న కులగణన ఇంటింటి సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో జి నరసింహారావు అన్నారు. ఎర్రుపాలెం మండలంలో జరుగుతున్న గుర్తింపు సర్వే స్టిక్కరింగ్ ప్రక్రియను పరిశీలించారు. బ్లాకుల వారీగా ఎన్యుమరేటర్లకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి కుటుంబ యజమాని వివరాలను సేకరిస్తూ ఎర్రుపాలెం ఎస్సీ కాలనీలో స్టిక్కరింగ్ వేస్తున్న తీరును పర్యవేక్షించారు. స్టిక్కరింగ్ అన్ని ఇళ్లను సర్వేలో ఉండేలా చూసుకోవడంతో పాటుగా కుటుంబ వివరాలను 8వ తేదీ లోపు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అడహాక్ కమిటీ సభ్యునిగా ముద్రగడ వంశీ

■ **టిడిపి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నరసింహులు ప్రకటన**



**ఇల్లెందు టౌన్ నవంబర్ 5 నవభూమి ప్రతినిధి:** మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో టిడిపి పార్టీ బలోపేతం కోసం పార్లమెంట్ పూర్తిస్థాయి అడక్ కమిటీని ఎన్నుకున్నట్టు ఆ పార్టీ పోలీస్ బ్యూరో సభ్యులు, జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. 2024- 26 సంవత్సరానికి గాను పార్టీ బలోపేతం కోసం సభ్యత్వం నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందుగ్గాను మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పూర్తిస్థాయి అడహాక్ని కమిటీ నియమిస్తున్నట్టు వారు తెలిపారు. అడహక్ కమిటీ కన్వీనర్ గా కొండపల్లి రామచంద్రరావు,

కమిటీ సభ్యులుగా 19 మందిని ఉన్నారని, ఇల్లందు నుండి ముద్రగడ వంశీని నియమిస్తున్నట్టు వాళ్లు తెలిపారు. ఈ సందర్భంగా ముద్రగడ వంశీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని, ఇల్లందు నియోజకవర్గంలో అందరి సహకారంతో అత్యధిక సభ్యత్వాలు చేస్తామని, తెలుగుదేశం పార్టీ వంద రూపాయలు పెట్టి సభ్యత్వం తీసుకున్న సభ్యులకి ఐదు లక్షల ఇన్సూరెన్స్ ఇస్తుందని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని, పార్టీలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల్ని, తమ ఊరి వారిని పార్టీలో సభ్యులుగా చేర్చి తమ బాధ్యతలు నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యునిగా నియమించినందుకు నారా చంద్రబాబునాయుడు కి, బక్కనీ నరసింహులు కి, కొండపల్లి రామచంద్ర రావు కి కృతజ్ఞతలు తెలియజేశారు. ముద్రగడ వంశీ కి కమిటీ సభ్యులు ఎనికైనా సందర్భంగా పట్టణ నాయకులు ప్రముఖ న్యాయవాది సీనియర్ పార్టీ నాయకులు పి.బాలకృష్ణ, టి ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర నాయకులు చాంధావత్ రమేష్ బాబు, కారు నర్సన్న, శ్యామ్ తీవారి, గోపాలకృష్ణ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు

# అంతర్జాతీయ స్థాయిలో గౌరవ డాక్టరేట్ అందుకున్న బియన్ఆర్కి ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందనలు





**బూర్గంపాడు నవంబర్ 5 నవభూమి:** డేస్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ యూస్ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయస్థాయిలో వివిధ రంగాలలో నిష్ణాతులైన వ్యక్తులకు 4 నవంబర్ 2024 హైదరాబాద్ లో అతిరథ మహారథుల చేతులమీదుగా డాక్టరేట్ పురస్కారాలను ప్రధానోత్సవం చేయడం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మన్ బి యన్ ఆర్ ని ఎంపికచేయడం మాకెంతో సంతోషం గా ఉంది. బి యన్ ఆర్ ఏజెన్సీ ప్రాంతంలో గత 30 సంవత్సరాలుగా విద్యారంగంలో విశేష కృషి చేసి వేలాది మంది విద్యార్థుల ఉన్నతికి మార్గ దర్శి అయిన మహెూన్నత వ్యక్తి రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఉత్తమ కరస్పాండెంట్ అవార్డు ను, ఉత్తమ గురువుగా గురుబ్రహ్మ అవార్డును, ఉత్తమ ఉపాధ్యాయులుగా బంగారు నంది అవార్డు అందుకున్న బి ఎన్ ఆర్ నేడు ఆయన చేసిన కృషికి ఫలితంగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుని పొంది గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని అందుకున్న సందర్భం గా బి యన్ ఆర్ ని బ్రిలియంట్ విద్యాసంస్థల అధ్యాపక బృందం మరియు విద్యార్థులు, శాలువా, పూలమాల లుతో సన్మానించి ఆనందోత్సాహాలతో కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. మున్ముందు కూడా ఎన్నో అత్యున్నత పురస్కారాలను పొందాలని కోరుకుంటూ ప్రేమతో అభినందనలు... తెలియజేస్తున్న నలజాల సత్యనారాయణ, మోటివేషన్ ల్ స్పీకర్ విష్ణు మూర్తి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు.

# ప్రతి విద్యార్థి ముఖ్యమే: డాక్టర్ ప్రభు దయాళ్




**రామవరం (కొత్తగూడెం) నవంబర్ 5 నవభూమి ప్రతినిధి:** డీయస్సీ -24 ద్వారా ఇటీవలే నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు, కొత్తగూడెం మండలంలో గల సకల ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మంగళవారం రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక విద్యాపర శిక్షణ శిబిరం నిర్వహించబడింది. తరగతి గది, పాఠశాలలో చేపట్టవల్సిన అంశాలు, నిర్వహణ గూర్చి విశ్లేషించారు. ఆన్ లైన్ లో రిపోర్టులు పంపే విషయాలను సి ఆర్ పి లు వివరించారు. తరగతిలో, పాఠశాలలో ప్రతి విద్యార్థి పట్ల శ్రద్ధ కనబరుస్తూ వారిలో గల అంతర్గత నైపుణ్యాలు, సామర్థ్యాలను వెలికి తీసేలా ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభుదయాల్ సూచించారు. విద్యావ్యవస్థలో పాఠశాల, తరగతి, విద్యార్థి ఈ మూడే ప్రధానాంశాలు. కావున ఈ మూడింటిని దృష్టిలో ఉంచుకొని వాటి అభ్యున్నతికై కృషి చేయాలన్నారు. ప్రాథమిక స్థాయిలో వేసే పునాదులే తర్వాత స్థానాలలో నిలబెడతాయన్నారు. తరగతి బోధన, పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుని పాత్ర, సర్వే వివరాలు, నిర్వహించాల్సిన రికార్డుల గూర్చి ఎంఈఓ పూర్తిగా విశ్లేషించారు. పాఠశాలల్లో ఆయా సమస్యల వల్ల ప్రాథమిక విద్యావసరాల అవసరత ఉన్న విద్యార్థులను గుర్తిస్తే, సాధ్యమయ్యే రీతుల్లో అవసరాలను తీర్చే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ సమావేశంలో కొత్తగూడెం మండల సకల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, సి ఆర్ పి లు పాల్గొన్నారు.

# గుండాలలో బంగారం దొంగలు దొరికారు



**గుండాల నవంబర్ 5 నవభూమి:** 30 అక్టోబర్ 2024 నాడు గుండాల నందు గల మణికంఠ జ్యువెలరీ షాపు నందు జరిగిన దొంగతనము కేసులో నలుగురు ముద్దాయిలు ఎట్టకేలకు పోలీసులకు దొరికారు. మంగళవారం ముగ్గురు ముద్దాయిలు అయిన మలపొలు శివ నాగ, విజయవాడ, బొమ్మిడి సాయి కుమార్ విజయవాడ, కాకినాడ శ్రీనివాస చారి, విజయవాడ లను అరెస్టు చేశామని, వారిని కోర్టులో హాజరు పర్చటం జరుగుతుందని గుండాల సిఐ రవీందర్ అన్నారు. వీరు నేరానికి ఉపయోగించిన ఆటోని స్వాదీనం చేసుకొననైనది. పరారీలో ఉన్న నేరస్తుడిని కూడా త్వరలోనే పట్టుకొని కోర్టు ముందు హాజరు పరుస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా మండలంలో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనపడితే పోలీసు వారికి వెంటనే తెలియజేయాలి. అదేవిధంగా ప్రతి ఒక్కరూ తమ కాలనీలల్లో సిసి కెమెరాలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకోవాలి. నేరాలను చేదించటంలో సీసీ కెమెరాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం. ఈ కేసు ను వారం రోజుల్లోపు ఛేదించిన గుండాల సీఐ రవీందర్, యస్. ఐ. రాజమౌళి, సిబ్బంది ని ఇల్లందు డి. యస్. పి. చంద్రభాను అభినందించారు. ఈ కార్యక్రమంలో గుండాల సీఐ రవీందర్, యస్. ఐ. రాజమౌళి, సిబ్బంది పాల్గొన్నారు

# శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో భారీ అన్నదానం

**చర్ల నవంబర్ 5 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం రైస్ పేట గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. సుమారు 2000 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించినట్టు ఆలయ కమిటీ వారు తెలియజేశారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నాలుగు వారాలు ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమం దాతలచే నిర్వహిస్తామని ఎంతో విశిష్టత కలిగిన ఈ దేవాలయానికి మంచి ప్రాముఖ్యత కలిగి ఉన్నదని ఆలయ అర్చకులు తెలియజేశారు. శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి అత్యంత ఇష్టమైన శ్రీఅభయ ఆంజనేయస్వామి సన్నిధిలో అన్నసంతర్పణ చేయడం ఎంతో సంతోషంగా ఉందని దాతలు అన్నారు ఇంకా మునుముందు ఎన్నో భక్తి శ్రద్దలతో కార్యక్రమాలను జరుపుకుంటామని చర్ల మండల ప్రజలు ఆయుష్ ఆరోగ్యాలతో అష్టైశ్వర్యాలతో పిల్లాపాపలతో సుఖసంతోషాలతో శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆశీస్సులు ప్రతి ఒక్కరి పై ఉండాలని ఆలయ కమిటీ వారు కోరుచున్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





# రైతుల వద్ద నుంచి మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు

- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్
- 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు 323 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- దొడ్డు, సన్న రకం ధాన్యం గుర్తింపుపై అధికారులకు శిక్షణ
- సన్న రకం ధాన్యం బోనస్ తెలంగాణ రైతులకు మాత్రమే దక్కేలా చూడాలి
- ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి







**ఖమ్మం, నవభూమి బ్యూరో, నవంబర్ 5:** జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల వద్ద నుంచి మద్దతు ధరపై నాణ్యమైన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని రాష్ట్ర గనుల శాఖ కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ కు ధాన్యం కొనుగోలు ప్రక్రియ కోసం చేపట్టిన చర్యల వివరాలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, సన్న రకం ధాన్యం క్రింద ఏ ధాన్యాన్ని పరిగణిస్తున్నామనే అంశం రైతులకు స్పష్టంగా తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దొడ్డు వడ్లు, సన్న వడ్లకు తేడాను స్పష్టంగా తెలియజేసేలా కొనుగోలు కేంద్రాల ఇంచార్జి లకు క్షేత్రస్థాయి సిబ్బంది శిక్షణ అందించాలని అన్నారు. జిల్లాలో ఉన్న మిల్లుల నుంచి బ్యాంకు గ్యారంటీ సమర్పిస్తామని అండర్ టేకింగ్ ఆఫిడవిట్ తీసుకొని ధాన్యం అలాట్మెంట్ చేయాలని తెలిపారు. రైస్ మిల్లుల వద్ద ఎక్కడ తాలు పేరుతో కోతలు పెట్టవద్దని అన్నారు. సన్న రకం దాన్యంపై ప్రభుత్వం ప్రకటించిన 500 రూపాయల బోనస్ తెలంగాణ రైతులకు మాత్రమే అందాలని అన్నారు. ఖమ్మం జిల్లా సరిహద్దు ప్రాంతం ఆంధ్రప్రదేశ్ నుంచి ఎటువంటి ధాన్యం మన జిల్లాకు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం పట్ల సానుకూలత వచ్చే విధంగా అధికారులు పని చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం, రైతులకు సకాలంలో చెల్లింపులు, సన్న రకం ధాన్యానికి బోనస్ వెంట వెంటనే అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల పరిధిలో వీలైనంతవరకు రైతుకు అనుకూలంగా ఉంటూ కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, రైతుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, నాణ్యత ప్రమాణాలను రైతులకు వివరించాలని, రైతుల కోసమే మనం ఉన్నామనే విషయాన్ని మర్చిపోవద్దని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల (1.3 లక్షల సన్న రకం, 70 వేల దొడ్డు రకం) ధాన్యం కొనుగోలు అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని, గతంలో ఖమ్మం జిల్లాలో 236 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉంటే ప్రస్తుతం 323 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఇందులో డీసీఎంఎస్ ద్వారా 27, డిఆర్డీఏ ద్వారా 138, పిఏసీఎస్ ద్వారా 158 కేంద్రాల ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన వెయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు మొదలగు మౌళిక వసతులు కల్పించామని అన్నారు. మన జిల్లా సరిహద్దు లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నందున 14 చెక్ పోస్ట్ లను అప్రమత్తం చేశామని, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులు 24 గంటలపాటు షిఫ్టులలో చెక్ పోస్ట్ వద్ద ఉండేలా చర్యలుతీసుకున్నామని అన్నారు. అవసరమైన పక్షంలో మరిన్ని చెక్ పోస్ట్ లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తన పరిధిలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నాణ్యత, లోకల్ రైతు, ధాన్యం దిగుబడి వివరాలను సర్టిఫై చేసేలా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మేర టార్ఫాలిన్ కవర్లు, గన్ని సంచులు అందుబాటులో పెట్టామని అన్నారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం తరలించేలా అవసరమైన వాహనాలు సన్నద్ధం చేశామని అన్నారు. 1077 టోల్ ఫ్రీ నెంబర్ తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, కొనుగోలు కేంద్రాలలో ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. జిల్లాలో ప్రైవేటు గోదాములలో అందుబాటులో ఉన్న స్థలం గుర్తించామని అన్నారు. మిల్లర్లతో సమావేశం నిర్వహించి బియ్యం అప్పగించిన వెంటనే బ్యాంకు గ్యారంటీలు విడుదల చేస్తామని సమాచారం అందించామని, బ్యాంకు గ్యారంటీ ఇచ్చేందుకు జిల్లాలో మిల్లర్లు అంగీకరించారని తెలిపారు. ధాన్యం రవాణాకు కేటాయించిన వాహనాలు ఇతర పనులకు వినియోగించకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ. అలీమ్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా సహకార అధికారి జి. గంగాధర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, అదనపు డిఆర్డీవో నూరొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘాన్ని గెలించండి

- ఖమ్మం,నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి తీకుళ్ళ సాయిరెడ్డి
- ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలి



**జూలురుపాడు,నవంబర్ 05 (నవభూమి ప్రతినిధి)** 2025 మార్చి లో జరగబోయే వరంగల్,ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎం ఎల్ సి ఎన్నికలలో అర్హత గల ఉపాధ్యాయులు, అధ్యాపకులు,ఆచార్యులు తమ ఓటును బాధ్యతగా భావించి వెంటనే నమోదు చేసుకోవలసిందిగా ఎ.పి. యు.ఎస్ టి.పి.యు.ఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు తీకుళ్ళ సాయిరెడ్డి,ఉపాధ్యాయులను కోరారు. మంగళవారం ప్రచార కార్యక్రమం లో బాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను కలిసి ఉపాధ్యాయ ఎం ఎల్ సి ఓటు నమోదు చేసుకోవలసిందిగా కోరారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆన్ లైన్లో / ఆఫ్ లైన్లో దరఖాస్తు చేసుకొనుటకు ఒక్క రోజే అవకాశం ఉందని అన్నారు.గత మార్చి నుండి ఉద్యోగవిరమణ పొందిన వారు కూడా తమ ఓటును నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రస్తుతం విద్యారంగ, ఉపాధ్యాయుల,అధ్యాపకుల, ఆచార్యుల సమస్యలు పరిష్కరించ బడాలంటే, ప్రభుత్వ పాఠశాలలు, విద్యాలయాలు కాపాడ బడాలంటే విద్యారంగ అభివృద్ధికి పాటుబడే జాతీయవాదులకు అండగా నిలిచి కౌన్సిల్ కు పంపాలని సాయిరెడ్డి కోరారు. టిపియుఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు సురేష్, ప్రధానకార్యదర్శి కృష్ణ, మాజీ అధ్యక్షులు శివరామ కృష్ణ, పాండురంగాచారి, ప్రధాన ఉపాధ్యాయులు తప్పెట లక్ష్మీ నరసయ్య తో పాటు ఆ సంఘ సభ్యులు పాల్గొన్నారు

## మండలంలో ఘనంగా నాగుల చవితి వేడుకలు





**ఏనుకూరు, నవభూమి, నవంబర్ 5:** మండలంలో ప్రజలు మంగళవారం నాగుల చవితి వేడుకనుఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు, చిన్నారులు ఉదయాన్నే తలస్నానాలు ఆచరించి గ్రామాల్లోని పుట్టల వద్దకి చేరుకున్నారు. నాగుల చవితి సందర్భంగా పుట్టకు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, గుడ్లతో పాటు పాలు పోసి పుట్ట చుట్టూ తిరిగి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గార్లవొడ్డు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, నాచారం వెంకటేశ్వర స్వామి దేవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గార్ల ఒడ్డు సమీపంలో గల పుట్ట వద్ద మంచినీటి సౌకర్యార్థం , విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

## శిశు సంరక్షణను ఆశాలు బాధ్యతగా తీసుకోవాలి



**ఎర్రుపాలెం, నవభూమి, నవంబర్ 5 :** శిశు సంరక్షణ ను ఆశాకార్యకర్తలు బాధ్యతగా తీసుకొని పని చేయాలని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రశాంత్ అన్నారు.ఆశా డే కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యం లో ఆశా కార్యకర్తల సమావేశం మంగళ వారం నిర్వహించారు.వైద్యులు ప్రశాంత్ మాట్లాడుతూ శిశు సంరక్షణలో భాగంగా గర్భిణిలను 12 వారాల లోపు గుర్తించి వారిని రిజిస్ట్రేషన్ చేయించి సరైన సమయంలో వారికి టీకాలు ఇప్పించాలన్నారు. గర్భిణీలకు,బాలింతలకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించి, ప్రసవానికి బనిగండ్లపాడు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే విధంగా ఆశాలు పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ ఇ ఓ సదాశివరావు,సూపర్ వైజర్లు కె.వెంకటేశ్వరావు, వేణుగోపాల్,లతాశ్రీ ,హెల్త్ అసిస్టెంట్లు,ఎం ఎల్ హెచ్ పి లు,ఏఎన్ఎం లు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్‌ను కలిసిన టియుడబ్ల్యూజే నాయకులు

**కూకట్‌పల్లి, నవంబర్ 05, (నవభూమి ప్రతినిధి) :** రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్.హరిష్ ను మంగళవారం సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో ప్రతినిధి బృందం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్బంగా జర్నలిస్టుల ఆయా సమస్యలను వారు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి సలహాలతో సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హరిష్ తెలిపారు. ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కలకూరి రాములు..

# ప్రగతిశీల భావజాల ఉద్యమాలను ఉధృతం చేద్దాం

- మతోన్మాద ఫాసిజాన్ని అడ్డుకుందాం
- ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య
- పి డి ఎస్ యు ఆధ్వర్యంలో విద్యార్థుల భారీ ర్యాలీ
- ఇల్లెందులో జెసిఎస్, నీలం రాంచంద్రయ్యల సంస్మరణ సభ



**ఇల్లెందు టౌన్ నవంబర్ 5 నవభూమి ప్రతినిధి:** దేశానికి ప్రమాదకరంగా మారుతున్న కుల, మతోన్మాద ఫాసిజన్ని అడ్డుకునేందుకు విద్యార్థులంతా శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని ప్రగతిశీల భావజాల వ్యాప్త ఉద్యమాలను ఉధృతం చేయాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పి డి ఎస్ యు ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇల్లందు పట్టణంలో పి.డి.ఎస్.యు. నిర్మాత జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ (జెసిఎస్) విప్లవ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నీలం రామచంద్రయ్యల సంస్మరణ సభ కాంపాటి పృథ్వి అధ్యక్షతన జరిగింది. సభ ప్రారంభానికి ముందు వేలాదిమంది విద్యార్థులతో జగదాంబ సెంటర్ నుండి పాత బస్టాండ్, బుగ్గ వాగు మీదుగా సభ ప్రాంగణమైన సాహితి డిగ్రీ కళాశాలకు చేరుకోవటం జరిగింది. అనంతరం విప్లవ విద్యార్థి ఉద్యమంలో అమరులైన వీరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం, కులం, మతం, దోపిడీ, పీడన, ఆర్థిక అసమానతలు లేని సమానత్వ సమాజం స్థాపన కోసం పోరాడుతూ అమరులైన వీరుల ప్రాణత్యాగాలు వెలకట్ట లేనివని అన్నారు. విప్లవకారులు మరణించినప్పటికీ వ్యవస్థ మార్పు కోసం జరిగే పోరాటాల్లో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారని తెలిపారు. 78 సంవత్సరాల భారత పార్లమెంటరీ పాలన ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేక పోయిందని, దేశంలో పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులు, అరికట్టలేక పోయారని, ప్రజలకు కనీసం అంతరాలు లేని ఉచిత విద్య, వైద్యం అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పుతూ దళిత, గిరిజన, బడుగు, బలహీన పేద వర్గాలను విద్యారంగానికి దూరం చేసే కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచారు కానీ పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల మాటేమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థి అమరవీరుల పోరాటస్ఫూర్తితో నేటి విద్యార్థులు ఉద్యమించి శాస్త్రీయ విద్య, సమానత్వ సమాజాన్ని స్థాపించుకోవాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. పూర్వ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల అశోక్ కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మడి అనురాధ, పి ఓ డబ్ల్యు మాజీ రాష్ట్ర కార్యదర్శి చంద్ర అరుణ, సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు నాయిని రాజు, పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ అజయ్, ఎఐపికెఎస్ జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న, పి.డి.ఎస్.యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ లు పాల్గొని ప్రసంగించారు. పి.డి.ఎస్.యు జిల్లా నాయకులు బానోత్ నరేందర్, మునిగేల శివ, పార్థసారథి, ఎనగంటి వంశీ, గంగాధర గణేష్, వంశీ పాల్గొన్నారు.













# రైతులకు మంత్రులు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

- ఎకరానికి 40 లక్షల పరిహారం అందించాలి
- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎదుట రైతులు ఆవేదన

**ఏనుకూరు, నవభూమి, నవంబర్ 5:** సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ కాల్వ క్రింద భూములు కోల్పోయిన రైతులకు మంత్రుల ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రైతులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రైతు వేదికలో సీతారామ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులతో మంగళవారం అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి హాజరై మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి 13 లక్షల 50 వేల చొప్పున ఇవ్వడం జరుగుతుందన్నారు. పొలంలో బోర్లు, పైపులైన్లు,పామాయిల్ పంట వంటివి కోల్పోతే వాటికి వేరే ధరలు కూడా కేటాయించామని ఆమె తెలిపారు. దీనికి రైతులు ఇంకేమైనా అభ్యంతరాలు ఉంటే తమకు లిఖితపూర్వకంగా రాసి అందజేయాలని కోరారు. రైతులు మాట్లాడుతూ ముందుగా మంత్రులు భూములు ఇచ్చిన వారికి మంచి ప్యాకేజీ తో డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు అధికారులు 13 లక్షల 50 వేలు చెల్లిస్తామంటే



ఎలా అని అధికారులతో వాగ్వాదానికి దిగారు. సీతారామ ప్రాజెక్టు కెనాల్ కింద భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి 40 లక్షల పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. రైతుల అభ్యంతరాల మేరకు పై ఆధారికారులకు తెలియజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శేషగిరిరావు, ఇరిగేషన్ డి ఇ చంద్రశేఖర్, డిప్యూటీ తాసిల్దార్ కిరణ్ కుమార్, ఆర్ ఐ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

